అంతరంగయాత్ర
జె. కృష్ణమూర్తి బోధనలతో కలిసి ప్రయాణం
ANTHARANGA YATRA
KRISHNAMURTI FOUNDATION INDIA DEC. 2006 - MARCH 2007 Rs.2/- VOL. I ISSUE 2



అంతర్గతమైన పేదరికం వున్నప్పుడే ధనాన్ని, అధికారాన్ని, ఆస్తిపాస్తుల సంపదనీ బాహాటంగా ప్రదర్శించి మురిసిపోతుంటాం. హృదయాలు శూన్యంగా వున్నాయి కాబట్టి వస్తువులను పోగుచేసుకుంటాం.

# ఈ ప్రపంచంలో ఎట్లా జీవించాలి? మన నిత్యజీవితాన్ని ఎట్లా గడపాలి?

*ఒకరి సందేహానికి సమాధానం*

**ప్రశ్న:** మా అందరిలోనూ ఏవో భయాలు-యుద్ధాన్ని గురించో, వుద్యోగం కనుక వుంటే అది పోతుందేమోనన్, వుగ్రవాదులని గురించో, మా పిల్లలలో కనబడుతున్న దౌర్జన్యం గురించో, అప్రయోజకులైన రాజకీయవేత్తల పాలిట పడ్డామే అనో-యిట్లా రకరకాల భయాలు మా జీవితాలను ఎప్పుడూ కలవర పెడుతూవుంటాయి. ఇటువంటి యీ జీవితాన్ని మేము ఏవిధంగా ఎదుర్కోవాలి?

**కృష్ణమూర్తి:** ఎట్లా ఎదుర్కొంటారు? ప్రపంచం రోజురోజుకూ హింసాపూరితంగా తయారవుతున్నదనే విషయం మనం వొప్పుకొని తీరాలి – అది స్పష్టంగా కనబడుతున్నది. యుద్ధప్రమాదం కూడా స్పష్టంగా కనబడుతూనే వున్నది. మన పిల్లలు హింసాత్మకంగా తయారవుతున్నారనే ఒక కొత్త వైపరీత్యం కూడా మన కళ్ళముందు వున్నది. కొంత కాలం కిందట భారతదేశంలో పిల్లల తల్లి అయిన ఒకావిడ మా వద్దకు రావడం గుర్తుకొస్తున్నది. భారతీయ సంప్రదాయం ప్రకారం తల్లి అంటే చాలా గౌరవనీయమైన స్థానంలో వుండే వ్యక్తి. ఈ తల్లిని తన పిల్లల ప్రవర్తన దిగ్భ్రాంతిలో ముంచింది. పిల్లలు ఆమెని కొడుతున్నారట. భారతదేశంలో కనీ వినీ ఎరగని సంగతి. అంటే ఈ హింస, దౌర్జన్యం ప్రపంచమంతా వ్యాపిస్తున్నాయి. ఇక ఈ ప్రశ్న అడిగినవారు అన్నట్లుగా వుద్యోగం పోతుందనే భయం ఒకటి వున్నది. ఇవన్నీ చూస్తూ యిదంతా తెలిసి, ప్రస్తుతం యిట్లా వున్న యీ జీవితాన్ని మీరు ఏ విధంగా ఎదుర్కోవాలి?

నాకు తెలియదు.నేను ఎట్లా ఎదుర్కోవాలో నాకు తెలుసు. మీరు ఎట్లా ఎదుర్కొంటారో నాకు తెలియదు. మొట్టమొదటగా, జీవితం అంటే ఏమిటి? ఎక్కడ చూసినా దుఃఖం, మితిమీరిన జనాభా, అప్రయోజకులైన రాజకీయ వేత్తలు, రకరకాల మాయలూ, మోసాలూ, చిత్తశుద్ధిలేకపోవడం, లంచగొండితనం వంటివి నిరాఘాటంగా సాగుతున్న ప్రపంచంలో మన

☞ 2

# సమస్త కాలమూ వర్తమానంలో ఉన్నది

*(గత సంచిక తరువాయి)*

మీ చేతనావర్తం మీదికాదు. మీ చేతన దానిలోని విషయంచే తయారైంది. విషయం లేనిదే చేతన లేదు. మీ చేతన మిగిలిన మానవజాతి చేతన మాదిరే నమ్మకాలతో, భయాలతో, విశ్వాసాలతో, దేవతలతో వ్యక్తిగత ఆకాంక్షలతో తయారైంది. ఆలోచన తయారుచేసిన వీటన్నింటితో మీ చేతనావర్తం నిర్మించబడింది.

భావపరంపరను వింటూన్నట్టుగా కాకుండా, మనం కలిసి ప్రయాణం సాగిస్తున్నామనీ, ఒకే బాటలో కలసి నడుస్తున్నామనీ ఆశిద్దాం. మనం భావాలనూ, ఆదర్శాలనూ వెంబడించడం లేదు, యథార్థాన్ని ఎదుర్కొంటున్నాం, ఎందుకంటే ఈ యథార్థంలోనే, దీనికి ఆవలగా దాటిపోవడంలో సత్యం ఉన్నది. ఎప్పుడైతే సత్యముంటుందో-అది చాలా ప్రమాదకరమైంది. సత్యం వ్యక్తిలో విప్లవాన్ని తెస్తుంది. అందుకే అది చాలా ప్రమాదకరమైంది. ప్రశ్నలు అడగడం మంచిదే. అయితే ఎవరిని మీరు ప్రశ్నిస్తున్నారు. ఈ వక్తను మీరడుగుతున్నారా? అంటే మీరు ఈ వక్తనుండి సమాధానం కోసం ఎదురు చూస్తున్నారా? అపుడు మీరు ఈ వక్త మీద ఆధారపడుతారు. అపుడు మీరు గురువుల్ని స్థాపించుకుంటారు. మనం ఎందుకు ప్రశ్నలు అడుగుతాం? ఈ ప్రశ్న గురించి మీరెప్పుడైనా ఆలోచించారా? ప్రశ్నలు అడగకూడదని కాదు-మనం విచారణచేస్తున్నాం, అంతే, మీరు ఈ వక్తను ఒక ప్రశ్న వేశారనుకోండి, అతను సమాధానం చెబితే మీరు దాన్ని అంగీకరిస్తారు లేదా వ్యతిరేకిస్తారు. మీ నిబద్ధతనూ, మీ నేపథ్యాన్ని అనుసరించి నా జవాబు మీకు తృప్తినిస్తే, అపుడు 'అవును మీతో పూర్తిగా ఏకీభవిస్తాను' అని అంటారు. మీరు అంగీకరించనట్లైతే 'ఏమిటిది అర్థం లేదు' అని అంటారు. అయితే మీరు

☞ 3

**ఇటీవల వెలువడిన క్రొత్త ప్రచురణ**

'ఏకైక విప్లవం': జె. కృష్ణమూర్తి 'ది వోల్లీ రివల్యూషన్' ను సి. హనుమంతరావుగారు తెలుగులోకి అనువదించారు. 258 పుటల ఈ పుస్తకం మూల్యం రు. 120/- కె.ఎఫ్ఐ చెన్నైకి వ్రాసి తెప్పించుకోవచ్చును. విశాలాంధ్ర వారి పుస్తక విక్రయ శాఖలన్నింటిలోను కూడా లభ్యమవుతుంది.

అస్తిత్వం అన్నది ఏమిటి? ఇదంతా ఎట్లా ఎదుర్కోవాలి? అందుకు మొదట తప్పనిసరిగా తరచి చూడవలసినది జీవించడం అంటే అర్థం ఏమిటనేది. ప్రస్తుతం వున్న ప్రపంచంలో జీవించడం అంటే ఏమిటి? మన నిత్య జీవితాన్ని అసలు ఎట్లా గడపాలి? సిద్ధాంతరూపేణా కాదు, తాత్త్విక యోచనగా కాదు, ఆదర్శవాదంగా కాదు, అసలు వాస్తవంలో మన నిత్య జీవితాన్ని ఎట్లా జీవించాలి?

మనం కనుక పరీక్షిస్తే, బాగా గాఢమైన స్పృహతోగమనిస్తే, అది ఒక నిరంతరమైన సమరం, నిరంతరమైన పోరాటం, ప్రయాస మీద ప్రయాస పడుతూ వుండటం. ఉదయం నిద్రలేవడమే ఒక ప్రయాస. ఏం చేయాలి మనం? తప్పించుకొని పారిపోవడం సాధ్యం కాదు. ఈ ప్రపంచంలో జీవించడం అసాధ్యం అని అనుకున్న చాలామంది అన్నింటినీ వదిలేసి ఎక్కడో హిమాలయాల్లోకి వెళ్ళిపోయి, అంతర్ధానమయ్యారు. అదంతా కేవలం తప్పించు కోవడం, యదార్థాన్నుండి పారిపోవడం. అది కూడా సమష్టిగా నివసించే సహజీవన సంఘాల్లో చేరి కలసిపోవడం లాంటిదే. బోలెడు ఆశ్రమాలూ, ఆస్తులూ వున్న గురువును చేరి అందులో పడి మునిగిపోవడం వంటిదే. వీళ్ళంతా నిత్యజీవితపు సమస్యలని పరిష్కరించుకోరు. సమాజంలో రావలసిన మార్పు, మానసికమైన విప్లవాల గురించి లోతుగా శోధించరు. వీటినుంచి పారిపోతారు. ఇక మనం–మనమూ తప్పించుకొని పారిపోకుండా, యీ వున్న ప్రపంచంలోనే నిజంగా జీవిస్తుంటే, అప్పుడు మనం ఏం చేయాలి? మన జీవితాల్ని మార్చుకోగలమా? మొత్తం జీవితంలో సంఘర్షణ అనేది లేకుండా చేసుకోగలమా, ఎందుకంటే సంఘర్షణ కూడా హింసలో ఒక భాగమే. అది సాధ్యమేనా? మన జీవితాలకు ఆధారం ఏమిటీ అంటే ఏదో ఒక గొప్పదనాన్ని సాధించాలనే పోరాటం; ప్రయాసా, పోరాటమూ.

ఈ ప్రపంచంలో నివసిస్తున్న మనుష్యులం మనం– మనల్ని మార్చుకోగలమా? అదే అసలైన ప్రశ్న– సమూలంగా, మనో తత్వంలోనే పరివర్తన తీసుకొనిరాగలమా? కాలక్రమేణా వచ్చే పర్యవసానంగా కాదు, కాలానికి కట్టుబడకుండా. లోతుగా ఆలోచించేవారికి, నిజమైన ఆధ్యాత్మికులకు రేపు అనేది వుండదు. రేపు లేదు అని అనడం చాలా కఠినవాక్యం. ఇవాల్టి రోజును సంరంభంతో పూజించడం అన్నది మాత్రమే వుంది. ఈ జీవితాన్ని ప్రతిరోజూ, పరిపూర్ణంగా, యదార్థంగా జీవించగలమా, మన బాంధవ్యాలలో పరివర్తన తేగలమా? అసలు సమస్య అదీ, ప్రపంచం ఎట్లా వుంది అన్నది కాదు. ఎందుకంటే ప్రపంచం అంటే మనమే. దయచేసి యిది గ్రహించండి: ప్రపంచం అంటే మీరు, మీరు అంటే ప్రపంచం. ఇది స్పష్టంగా కనబడుతున్న, భయంకరమైన వాస్తవం. ఆసాంతంగా ఎదుర్కోవలసిన ఒక పెద్ద సమస్య – అంటే ఎంతో అసహ్యమైనవన్నీ కలిగివున్న యీ లోకం అంటే మనమే అనీ, మనకీ అందులో భాగస్వామ్యం వుందనీ, యిదంతా యిట్లా వుండటంలో బాధ్యత మనమీద కూడా వున్నదనీ, మధ్య ప్రాచ్యంలో జరుగుతున్నదానికి, ఆఫ్రికాలో జరుగుతున్నదానికి, ప్రపంచమంతటా జరుతున్న మతిలేని వ్యవహారాలన్నింటికీ మనమూ బాధ్యులమేనని గ్రహించడం; మన తాతలు, మన ముత్తాతలు చేసిన క్రియలకు – బానిసత్వం, వేలకొద్దీ యుద్ధాలు, సామ్రాజ్యాల్లోని క్రూరత్వం – మనం బాధ్యులం కాకపోవచ్చును కానీ మనమూ అందులోని వాళ్ళమే. మన బాధ్యతను మనం గ్రహించకపోతే, అంటే మన సమస్త బాధ్యతను, మనం చేసే పనులకు ఆలోచనలకు, ప్రవర్తనకు మన బాధ్యతను మనం గుర్తించకపోతే, అప్పుడు బొత్తిగా ఏ ఆశా లేనట్లే. లోకం సంగతి తెలుసు కాబట్టి వ్యక్తిగతంగా విడివిడిగా మనం యీ వుగ్రవాదపు సమస్యను పరిష్కరించలేమని తెలుసు కాబట్టి. ఇది ప్రభుత్వాల సమస్య. పౌరులకు భద్రత, రక్షణ కల్పించడం వారి విధి. అయితే అది వారు లక్ష్య పెట్టడంలేదు. తమ ప్రజలను రక్షించుకోవాలనే సంగతి ప్రతి ప్రభుత్వమూ నిజంగానే కనుక పట్టించుకుంటే, అప్పుడు యుద్ధాలు వుండవు. కాని ప్రభుత్వాలకు కూడా మతి స్థిరత్వం పోయినట్లే కనబడుతున్నది. వాళ్ళకి కావలసినదల్లా పార్టీ రాజకీయాలు, వాళ్ళ అధికారం. వాళ్ళ పదవులు, వాళ్ళ పలుకుబడి – అవన్నీ, ఆ నాటకం అంతా మీకు తెలుసు.

కాబట్టి, కాలాన్ని లెక్కలోకి తీసుకోకుండా, అంటే రేపు గురించి, భవిష్యత్తు గురించి ఆలోచించకుండా, యివాళే అత్యంత ప్రధానం అన్నట్లుగా మనం జీవించగలమా? అంటే అర్థం, మన ప్రతిస్పందనల ఎడల, మనలోని గందరగోళం ఎడల అశేషమైన జాగరూకతతో వుండాలి – మనపై మనమే ఒక పరమావేశాన్ని ప్రయోగించుకోవాలి. మనం చేయగలిగిన పని యిదొక్కటేగా కనబడుతున్నది. ఇది కనుక మనం చేయకపోతే మానవుడికి భవిష్యత్తు లేదు. పత్రికల్లో వస్తున్న పతాక శీర్షికలను మీరు చూస్తున్నారో లేదో నాకు తెలియదు – యుద్ధం కోసం జరుగుతున్న సన్నాహాలను గురించి. సన్నాహాలు జరుగుతున్నాయంటే అది తప్పక జరిగితీరుతుందన్నమాటే – వంటకాలు తయారు అవుతున్నట్లుగా. ప్రపంచంలోని సామాన్య ప్రజలకీ సంగతి పట్టినట్లు లేదు. మారణాయుధాల తయారీలో మేధాపరంగా, వైజ్ఞానికంగా పాల్గొంటున్న వాళ్ళూ లక్ష్యపెట్టడం లేదు. వాళ్ళకు కావలసినదల్లా తమ వృత్తిలో పైకి పోవడం, తమ వుద్యోగాలు, తమ పరిశోధనా. చాలా సామాన్య పౌరులుగా లెక్కించబడే మనలాంటి వాళ్ళం, మధ్య తరగతి అని పిలవబడే మనం కూడా కనుక లక్ష్యపెట్టకపోతే మాత్రం మనమంతా నడి సముద్రంలో దూకినట్లే. ఇందులోని విషాదం ఏమిటంటే మనం యిది లెక్కచేస్తున్నట్లుగా కనబడటంలేదు.

అందరం కలసి ఒకచోట చేరడానికి మాత్రం చాలా వుత్సాహం చూపుతాం. అవి యీ యుద్ధాలు,యీ నరికిపోగులు పెట్టుకోవడాలు ఆపు చేస్తాయని ఆశపడతాం. ఇంతవరకూ అవి ఏమీ చేయలేదు. సభలూ, సంస్థలూ వీటిని ఆపడం అనేది జరగదు. మానవ హృదయమే, మానవ మస్తిష్కమే అసలు యీ పనులను చేయిస్తున్నది. దయచేసి యివి ఆవేశంతో అంటున్న మాటలని అనుకోకండి. నిజంగానే చాలా గొప్ప వుపద్రవాన్ని మనం ముఖాముఖిగా ఎదుర్కోబోతున్నాం. ఇందులో పాల్గొంటున్న చాలా ప్రముఖులైనవారిని వేము కలుసుకున్నాం. వారు యీ విషయంలో చాలా నిర్లక్ష్యంగా వున్నారు. మనం కనుక యిది పట్టించుకున్నట్లయితే, మన నిత్యజీవితాన్ని సవ్యంగా గడుపుతే, ప్రతిరోజూ మనం ఏం చేస్తున్నామన్న స్పృహ మనలో వుంటే, అప్పుడు భవిష్యత్తు కొంత ఆశాజనకంగా వుంటుంది.

*('మీటింగ్ లైఫ్' నుండి)*

**ఒక వినతి**

ఈ సంచికలు చదవాలనే ఆసక్తి ఉన్నవారి చిరునామాలు మాకు తెలపండి. గ్రంధాలయాలు, సంస్థల పేర్లు, చిరునామాలు కూడా తెలపవచ్చు.

### సమస్త కాలమూ వర్తమానంలో ఉన్నది

*(1వ పేజీ తరువాయి)*

ప్రశ్ననే పరిశీలించడం మొదలు పెడితే, జవాబు ప్రశ్ననుండి వేరుగా ఉన్నదా? లేక జవాబు ప్రశ్నలోనే ఉందా? పుష్పపరిమళమే పుష్పం. పరిమళం యొక్క సారమే పుష్పం. అయితే మన సమస్యలు పరిష్కరించడానికీ ప్రోత్సాహం పొందడానికీ ఇతరుల మీద ఎంతో ఆధారపడుతాం, అందువలన మన గందరగోళం నుండి అధికారాన్నీ, గురువులనూ, పురోహితులనూ సృష్టించుకుంటాం. ప్రశ్నించడం మంచిదే. వీటన్నింటిగురించి మీరు ఆలోచించారేమో నాకు తెలియదు. నిష్పక్షపాతంగా విషయాన్ని చూస్తూ, పరిశోధననీ, చర్చనీ సాగించే కళను మనం కోల్పోయాం. ఇది చాలా క్లిష్టమైనది; బహుశా ఈ విషయం చర్చించడానికి ఇది తగిన సందర్భం కాదనుకుంటాను.

చిన్నతనం నుండీ మనం ఎందుకు మానసికంగా దెబ్బతిన్నామో కూడా మీరు తెలుసుకోవాలి. మనలో చాలామంది మానసికంగా గాయపడ్డాం. ఈ స్పృహ కలగి ఉన్నా, లేకున్నా ఆగాయంనుండే మన సమస్యలు చాలా ఉదయిస్తాయి. కొట్టినందువల్లనో, అసహ్యకరంగా క్రూరంగా, దౌర్జన్యంగా ఏదో అన్నందువల్లనో బిడ్డ గాయపడుతాడు. 'నేను గాయపడ్డాను' అని మీరన్నపుడు గాయపడిందెవరు? గాయపడింది మీగురించి మీరేర్పరచుకున్న ఊహాస్వరూపమా– మనోతత్వమా? ఈ వక్త ఏ మనస్తత్వగ్రంధాలుగానీ, తాత్విక, మతపరమైన గ్రంధాలుగానీ చదవలేదు. అతనిప్పుడు మీతో కలసి పరిశోధన చేస్తున్నాడు. మనోతత్వం అంటే నేను – నా గురించి ఏర్పరచుకున్న మనోరూపమే నేను. అందులో ఆధ్యాత్మికమైనదేమీ లేదు. 'ఆధ్యాత్మిక' మనేది మరొక అసహ్యమైన పదం. కాబట్టి మనోరూపం గాయపడుతుంది. ఆ మనోబింబాన్ని మన జీవితాంతం మోసుకెళతాం. ఒక మనోరూపం గనక ఉల్లాసకరంగా లేకుంటే, ఆహ్లాదకరమైన మరొక మనోరూపాన్ని తయారుచేసి దాన్నిప్రోత్సహిస్తాం. ఇది యోగ్యమైనదనీ, ప్రాముఖ్యంగలదనీ, మన జీవితానికి మేధోవంతమైన అర్థాన్ని ఇస్తుందనీ భావిస్తాం.

ఎవరి గురించైనా – దేవుడితో సహా – అలాంటిదేదైనా ఉంటే, ఏ ఒక్క మనోబింబం లేకుండా – భార్యగురించీ, పిల్లలగురించీ, భర్త గురించీ ఇంకా ఇలాంటివాటి గురించి – మనోరూపం ఏర్పరచుకోకుండా ఈ భూమ్మీద జీవించడం సాధ్యమేనా? ఒక్క మనో బింబమైనా లేకుండా ఉండటం? అప్పుడే ఎప్పుడూ గాయపడకుండా ఉండటం సాధ్యం.

# మీరు మారితే అది సమస్త మానవాళిమీదా ప్రభావం చూపుతుంది

**ఇది చాలా ప్రధానమైన, చాలా అత్యావశ్యకమైన ప్రశ్న. మనిషి-అంటే మీరు ఈ మార్పును మీ లోపల తీసుకొని రాగలుగుతారా? అంతే కాని, "నేను మారితే దానికి అంత పెద్ద విలువ వుంటుందా? విశాలమైన చెరువులో ఒక నీటిబొట్టులాగా, నేను మారడం వల్ల ఏం ప్రయోజనం జరుగుతుంది" అని ప్రశ్నించారంటే అది సరియైన ప్రశ్నకాదు. దయచేసి ఏమీ అనుకోకండి. అది తప్పు ప్రశ్న అని ఎందుకంటున్నానంటే మీరే తక్కిన మానవాళి కాబట్టి. మీరే ఈ ప్రపంచం. ఈ ప్రపంచమూ మీరూ వేరు కాదు. మీరు ఒక అమెరికనూ కాదు, రష్యనూ కాదు. హిందువూకాదు ముస్లిమూ కాదు. ఈ అంటించుకున్న ముద్రల మాట కాదు మీరు. మీరు ఆ తక్కిన మానవాళే. ఎందుకంటే మీ చేతనావర్తమూ, మీ ప్రతిస్పందనలూ తక్కిన వారివీ ఒకటే. అన్నీ ఒక్కమాదిరే వుంటాయి. మీ భాష వేరు కావచ్చు. మీ ఆచారాలు వేరు కావచ్చు. అందతా పైపై సంస్కారం. నిజానికి అన్ని సంస్కారాలూ సంస్కృతులూ పైపైన వుండే లోతులేని సంస్కృతులే. కానీ, మీ చేతన మీ ప్రతిస్పందనలు, మీ విశ్వాసం, మీ నమ్మకాలు, మీ సిద్ధాంతవాదాలు, మీ భయాలు, మీ ఆందోళనలు, ఒంటరితనం, దుఃఖం, సుఖం, మాత్రం తక్కిన మానవాళికి వున్నటువంటివే. మీరు కనుక మారితే అది సమస్త మానవాళినీ ప్రభావితం చేస్తుంది.**

మనకు సమయం తక్కువగా ఉంది. పైగా భయం నుండి విముక్తి పొందడం సాధ్యమేనా అన్న అంశాన్ని కూడా మనం జాగ్రత్తగా పరిశోధించాల్సి ఉంది. నిజంగా ఇది ప్రముఖంగా ప్రశ్నించవలసిన ప్రశ్న. మీ కొఱకు నేనడగడం కాదు, మీకోసం మీరే అడుగుతున్నారు; క్రూరత్వంతో నిండిన, అమితంగా హింస పెరుగుతూన్న ఒక ఆధునిక సమాజంలో జీవిస్తూ భయంనుండి విడుదల పొందడం సాధ్యమేనా? ఇది విశ్లేషణకు పూర్తిగా భిన్నమైనది. ఎలాంటి వక్రీకరణలు లేకుండా గమనించడం. ఉదాహరణకు ఈ హాలును గమనించడం. ఎన్ని వరసలున్నాయో, పక్కనున్నవారి దుస్తులూ, ముఖమూ, ఎలా మాట్లాడుతున్నదీ– కేవలం చూడడం. విమర్శించకుండా, అంచనా వేయకుండా, నిర్ణయాలు చేయకుండా గమనించడం మాత్రం. ఒక చెట్టుని పరిశీలించండి. చంద్రబింబాన్ని, వేగంగా ప్రవహిస్తున్న నీటినీ పరిశీలించండి. మీరలా గమనించినపుడు మీ అంతట మీరు అందమంటే ఏమిటి? అని అడుగుతారు.

మీరెలా అందంగా ఉండాలో, మీముఖం, మీ జుత్తు, మీ మేని ఛాయ ఇంకా మిగిలిన వాటి అందం గురించి పత్రికల్లో చాలా మాట్లాడుతారు. కాబట్టి అందమంటే ఏమిటి? బొమ్మలో, చిత్రీకరణలో, విచిత్రమైన ఆధునిక ఆకృతిలో అందం ఉందా? పద్యంలో అందం ఉందా? అందం భౌతికంగా ముఖంలో దేహంలో ఉందా? మీరెప్పుడైనా ఈ ప్రశ్న వేశారా, మీరొక చిత్రకారుడో, కవో, సాహితీవేత్తో అయితే అత్యంత అందమైన దాన్ని వర్ణిస్తారు, ముచ్చటైన దాన్ని చిత్రిస్తారు. మీ కవితల్లో అస్తిత్వాన్ని నిజంగా కుదిపేసే కవిత వ్రాస్తారు. కాబట్టి అందమంటే ఏమిటి? ఒక మంచి ఆటవస్తువును, జటిలంగా వుండే బొమ్మను అల్లరి చేస్తూ, అరుస్తూ, ఆడుతూన్న ఒక పిల్లవాడికిస్తే, అతడు ఆ బొమ్మలో పూర్తిగా లీనమౌతాడనీ, లీనమైనందువల్ల అతని అల్లరంతా ఆగిపోతుందనీ ఎప్పుడైనా గుర్తించారా? ఒక పద్యంలోనో, ఒక ముఖంలోనో, ఒక చిత్రంలోనో, లీనంకావడం – అలా విలీనం కావడమేనా అందమంటే? శాశ్వతమైన మంచుతో, హిమశిఖరాల్ని కలిగిన అపురూప పర్వతాన్నీ, నీలాకాశంలో అవి గీసిన రేఖలనూ చూసినప్పుడు ఒక క్షణం ఆ పర్వత బ్రహ్మాండత్వం నా అన్ని సమస్యలూ, ఆదుర్దాలతో సహా నన్నూ నా అంతటినీ మటుమాయం చేస్తుంది. ఆ మహాశిలల ఘనతలో, సుందరమైన లోయల్లో, నదుల్లో, ఆక్షణం, ఆసెకను 'నేను' అనేదిఉండదు. కాబట్టి బొమ్మ బిడ్డను శాంతపరచినట్టు పర్వతం 'నా' అనేదాన్ని తరిమేసింది. ఆ పర్వతం, ఆనదీ, నీలిలోయలోతులూ ఒకసెకనుకాలం మీ అన్ని సమస్యలనూ, అన్ని ఆడంబరాలనూ, ఆదుర్దాలనూ దూరం చేస్తుంది. అపుడు మీరు 'ఎంత అందంగా ఉందీ' అంటారు. అయితే బయట దేనితోనూ లీనంకాకుండా అందమనేది

ఉందా? అంటే ఎక్కడ నేనన్నది లేదో అక్కడ అందం ఉంది.

దయచేసి నిద్రపోకండి. మీరు మంచి భోజనం తిని ఉండొచ్చు, తినే ఉంటారను కుంటాను, అయితే ఇది నిద్రపోవాల్సిన చోటుకాదు. ఇది మీ సమస్య, మీ జీవితం. ఈ వక్త జీవితం కాదు; మనం మీ జీవితాన్నీ, మీదురభిమానాలనూ, మీ నిరాశలనూ, మీ దుఃఖాలనూ గురించి మాట్లాడుకుంటున్నాం. కాబట్టి మీకు ఆసక్తి ఉంటే మరోఇరవై, ముప్పై నిముషాలు మేలుకొనే ఉండండి.

'నేను' అనేది లేనప్పుడు అందముంటుంది. దానికి గొప్ప ధ్యానమూ, తీవ్రవిచారణా, మహత్తరమైన క్రమశిక్షణా అవసరం. డిసిప్లిన్ అనే ఇంగ్లీషు పదానికి గురువుదగ్గరనుండి డిసైపుల్ అంటే శిష్యుడు నేర్చుకోవడం అని అర్థం. నేర్చుకోవడం- అనుసరణలో, అనుకరణలో, సర్దుకోవడంలో వలె క్రమబద్ధం కావడం కాదు, నేర్చుకోవడం మాత్రం. నేర్చుకోవడమనేది తనదైన మహత్తర క్రమశిక్షణను తెస్తుంది. అంతర్గత సంయమనానికి క్రమశిక్షణ అవసరం.

తర్వాత ఇప్పుడు భయమంటే ఏమిటో కలసి విచారణ చేద్దాం. భయమంటే ఏమిటి? మానవజాతి భయంతో సర్దుకొనిపోయి జీవించింది. దానిని పరిష్కరించుకోలేక పోయింది. - ఎన్నడూ. చాలారకాల భయాలున్నాయి; మీరు మీయొక్క ప్రత్యేక భయాలు కలిగి ఉన్నారు; మృత్యుభయం, దేవుని భయం, రాక్షస భయం, మీ భార్య భయం, మీ భర్త భయం, రాజకీయవేత్తల భయం - దేవునికే తెలియాలి ఎన్ని భయాలున్నాయో. భయమంటే ఏమిటి; కేవలం బహురూపాల్లో భయం యొక్క అనుభవం కాకుండా భయం యొక్క నిజతత్వం, యదార్థం ఏమిటి? భయం అసలెలావచ్చింది? మానవజాతి- అంటే మనలో ప్రతి ఒక్కరం - టి.విలో హింసనూ, దైనందిన జీవితంలో హింసనూ చివరికి యుద్ధంగా పిలవబడే వ్యవస్థాపరంగా చంపే దౌర్జన్యాన్నీ - భయాన్ని జీవిత విధానంగా ఎందుకు అంగీకరించాం?

భయం హింసకు సంబంధించినది కాదా? భయమనే ఊహను కాకుండా భయం అనే యథార్థాన్ని విచారణ చేస్తున్నాం. ఈ రెండింటి తేడా అర్థమయ్యిందా? భయమనే ఊహ, భయం యొక్క యథార్థతనుండి వేరైనది; అవునా? కాబట్టి భయమంటే ఏమిటి? అదెలా వచ్చింది?

కాలానికీ, ఆలోచనకూ, భయానికీ ఉన్న సంబంధం ఏమిటి? రేపటి గురించో, రాబోయే రోజుల గురించో, మృత్యు భయంతోనో, ఇపుడు యథార్థంగా జరుగుతూ వున్నదాని గురించో భయపడి ఉండొచ్చు. కాబట్టి దయచేసి మనం కలసి విచారణ చేద్దాం. ఈ వక్త 'కలసి' అని మళ్ళీ మళ్ళీ అంటున్నాడు, గమనించండి; నా సరదా కోసం నేను మాట్లాడటం లేదు. భయాన్ని కాలం తెచ్చిందా? గతంలో మిమ్మల్ని గాయపరచడానికి ఎవరో ఏదో చేసి ఉంటారు, గతమనేది కాలం, భవిష్యత్తూ కాలమే. వర్తమానమూ కాలమే కాబట్టి భయానికి ప్రధాన కారణం కాలమేనా? అని మనం అడుగుతున్నాం. భయానికి చాలా చాలా శాఖలూ, చాలా ఆకులూ ఉన్నాయి, అయితే కొమ్మల్ని కత్తిరించడం వలన లాభం లేదు; భయం భయమే కాబట్టి, భయం యొక్క అనేక రూపాలకు మూలమేదని కాకుండా భయానికి మూలమేమిటి? అని మనం అడుగుతున్నాం. భయంలోంచే మీరు దేవుళ్ళనూ, రక్షకులనూ తయారు చేశారు. మీకు మానసికంగా, సంపూర్ణంగా భయమనేది లేకుంటే అప్పుడక్కడ గొప్ప ఉపశమనం, చెప్ప లేనంత స్వేచ్ఛాభావం ఉంటుంది. మీరు జీవితంలోని బరువులన్నింటిని వదిలేశారు. కాబట్టి మనం 'సమయం అన్నది ఒక కారణమేనా' అనే ప్రశ్న ను చాలా తీవ్రంగా, సన్నిహితంగా, సందేహిస్తూ విచారణ చేయాలి. ఇపుడు నాకొక మంచి ఉద్యోగం ఉంది. రేపు దాన్ని నేను పోగొట్టుకోవచ్చు, అందువలన నేను భయపడ్డాను. ఎక్కడయితే భయముంటుందో అక్కడ అసూయా, ఆదుర్దా, ద్వేషమూ, దౌర్జన్యమూ ఉంటుంది. కాబట్టి భయానికి కాలమొక కారణం. దయచేసి దీన్ని చివరిదాకా వినండి, కాలాన్ని నేనెలా ఆపగలను; అని అనకండి. అది కాదు సమస్య; ఒకరకంగా అది అర్థం లేని చెత్త ప్రశ్న.

కాలమొక కారణం, ఆలోచనఒక కారణం; ఏం జరిగిందో దానిగురించి ఆలోచించడం. ఏం జరుగుతుందోనని ఆలోచించడం. భయానికి ఆలోచించడం ఒక కారణమా? ఆలోచించడమే భయాన్ని తెచ్చిందా? కాలం భయాన్ని తెచ్చింది. అవునా; కాలమంటే గడియారం చూపేకాలమే కాదు, 'నేను ఫలానా కాబోతున్నాను; 'నేను మంచివాడిని కాదు, కానీ అవుతాను; 'నాలోని హింసను తొలగించుకుంటాను' అనే మానసిక కాలం. ఇది మళ్ళీ భవిష్యత్తే. ఇదంతా కాలాన్ని సూచిస్తుంది. కాలమంటే ఏమిటి? అనేది మనం తప్పక విచారణ చేయాలి. దీని కంతటికీ మీరు తయారుగా ఉన్నారా? ఇవన్నీ తెలిసి కోదలచుకుంటున్నారా? నాకు విస్మయంగా ఉంది, ఎందుకంటే మీకు మానసిక రోగచికిత్సకులు, మతగురువులు, మీ నాయకులు మీరు ఏం చేయాలో ఆదేశించి చెప్పారు, నేర్పించారు - ఎల్లప్పుడూ సహాయంకోసం ఆరాటపడుతూ, సహాయాన్ని పొందే కొత్తదారులు వెతుకుతూ వుంటారు మీరు. కాబట్టి ఒకరు మరొకరికి బానిసలయ్యారు. విచారణ నల్పడానికీ, తనంతట తాను సంపూర్ణంగా మానసికంగా నిలబడడానికీ మనిషి ఎప్పుడూ స్వేచ్ఛగా లేదు.

అందుచేత మనం ఇపుడు కాలమంటే ఏమిటని విచారణ చేయబోతున్నాం. కాలమంటే ఏమిటి? గడియారానికి భిన్నంగా,సూర్యోదయ సూర్యాస్తమయాలకు భిన్నంగా వెలుగు నీడలకు భిన్నంగా, కాలమంటే ఏమిటి? ఆంతరంగికంగా కాలం యొక్క స్వభావాన్ని నిజంగా అర్థం చేసుకుంటే మీ అంతట మీరు కాలమనేదే లేదనే అద్భుతత్వాన్ని కనుగొంటారు.

కాలమనేది గతం, అవునా? కాలం భవిష్యత్తూ, కాలం వర్తమానమూ. ఈ మొత్తం చక్రభ్రమణమే కాలం. మీరేం ఆలోచించిందీ, మీరు జీవించిన విధానమూ, మీ అనుభవాలూ, క్రైస్తవుడనీ, హిందువనీ, బౌద్ధుడనీ, తదితరమైన మీ నిబద్ధతా- ఇదంతా మీ నేపథ్యం - మీ గతం; గతం లేకుండా మీరిక్కడ ఉండేవారు కాదు.

## పలాయనం ధ్యానం కాదు

ధ్యానమంటే ఈ ప్రపంచం నుండి పారిపోవడం కాదు. తన చుట్టూ దడి కట్టుకొని తనని తాను ఒంటరిగా చేసుకొనే కార్యకలాపమూ కాదు. ఈ ప్రపంచాన్నీ, దాని పోకడలనూ ఆకళింపు చేసుకోవడం కూడా ధ్యానమే. ప్రపంచం మనకి ఇవ్వగలిగినది అన్న వస్త్రాలూ, ఆశ్రయమూ, కొన్ని సుఖాలూ వాటితో పాటుగా అశేషమైన దుఃఖమూ అంతే.

ఇటువంటి ప్రపంచానికి ఆవలగా సంచరిస్తూ పోవడమే ధ్యానం. ఈ ప్రపంచానికి చెందకుండా పూర్తిగా పరాయివారమై పోవాలి. అప్పుడు ప్రపంచానికి ఒక అర్థం వుంటుంది. అప్పుడు ప్రేమ అంటే సుఖం కాదు. అప్పుడు భూమ్యాకాశాల సౌందర్యం అనంతమవుతుంది. అప్పుడు, ఒత్తిడుల, వైరుధ్యాల కారణంగానో, స్వీయ సాఫల్యత సాధించడం కోసమో, అధికారగర్వంతోనో చేసే పనుల వంటిది కానటువంటి చర్య ఆరంభమవుతుంది.

*('ది వోన్లీ రివల్యూషన్' నుండి)*

మీరు క్రిష్టియన్లుగా రెండువేల సంవత్సరాలుగా, హిందువులు మూడునుండి అయిదు వేల ఏళ్ళుగా ఈ విధమైన జీవన పధాన్ని నిర్ణయించుకున్నారు. కంప్యూటర్‌లాగా చేసినదే మళ్ళీ మళ్ళీ తిరిగీ చేస్తారు. ఇప్పుడు మీరేమిటో అది గతం యొక్క ఫలితం కాబట్టి గతమే వర్తమానం. రేపూ, రానున్న వేలరోజులూ ఇపుడు మీరేమిటో అదే. కాబట్టి భవిషత్తూ ఇపుడే. ప్రస్తుతం లో కాలమంతా ఇమిడి ఉంది. ఇది సిద్ధాంతం కాదు; యథార్థం, వాస్తవం కూడా. ఇపుడు మీరేమిటో అది గతం యొక్కఫలితం. రేపు మీరేమి కానున్నారో అది ఇపుడు మీరున్నదే. ఈ రోజు నేను హింసాత్మకంగా ఉంటే, రేపూ నేను హింసాత్మకంగానే ఉంటాను. కాబట్టి నేను సమూలంగా మౌలికంగా ఉత్పరివర్తనం తీసుకు వస్తే తప్ప, రేపు ప్రస్తుతంలో, వర్తమానంలోనే ఉంటుంది. లేకుంటే నేనెలా ఉన్నానో అలాగే ఉంటాను. మనం సుదీర్ఘ పరిణామక్రమాన్ని పొందాం, పరిణమించీ, పరిణమించీ, పరిణమించీ నేటి స్థితికి వచ్చాం. మనం ఇదే ఆట కొనసాగించామంటే రేపూ హింసాత్మకంగానే, ఆటవికంగానే ఉంటాం. కాలమంతా ప్రస్తుతంలోనే ఇమిడి ఉన్నది అనేది ఒక వాస్తవం, యథార్థం కాబట్టి, ఇప్పటి మన ప్రవర్తనలో, మన జీవన విధానంలో, ఆలోచనా సరళిలో, అభిప్రాయపడడంలో సంపూర్ణ ఉత్పరివర్తన రాగలదా? ఎందుకంటే సమూలంగా, మానసికంగా ఉత్పరివర్తనం తీసుకరానట్లైతే అపుడు మనం ఖచ్చితంగా గతంలో మాదిరే ఉంటాం, కాబట్టి అసలు ఈ మానసిక ఉత్పరివర్తనం తేవడం సాధ్యమేనా?

చాలామంది మాదిరే మీరు కూడా దిక్కూ దిశా పట్టించుకోకుండా మీ జీవితకాలమంతా ఏ ఉత్తరం వైపుకో ప్రయాణిస్తూ వుంటే జీవితాంతం వెళుతూ ఉంటే, ఎవరైనా ఎదురై ఉత్తరం వైపువెళితే ఎక్కడికీ తీసుకెళ్ళదు, దానికి అంతమే లేదు అని చాలా గట్టిగా చెబితే మీరూ తీవ్రంగా బాహ్యంగా చెవులతోనే కాకుండా ఇంకా గాఢంగా కూడా ఆలకిస్తారు. తూర్పుకో, దక్షిణానికో వెళ్ళమంటే 'అలాగే చేస్తాను' అంటారు. ఆ క్షణంలో కొత్త మలుపు తీసుకున్నారు, అక్కడ ఉత్పరివర్తనం జరిగింది. దీనిని ఇంకా సరళంగా చేసి చెప్తున్నాడు ఈ వక్త. అయితే, ఈ దారిలో శతాబ్దాలుగా వెళుతున్నా ఏమాత్రమూ మనం మారలేదని తెలుసుకోవడమన్నది చాలా జటిల సమస్య. మనం హింసాత్మకంగా, క్రూరంగా ఇంకా అలాగే ఉన్నాం. దీన్ని మనం బుద్ధితోనో, మాటలతోనో కాకుండా లోతుగా, యదార్ధంగా గ్రహించితే, అప్పుడు మనం మరో దిశకు మళ్ళుతాం. ఆ

# మరొక రకమైన సమాజ కృషి

**బాధితుల కోసంగాను సహాయ కార్యక్రమాలు, సేవ అవసరం అని మీరు అనుకుంటారు. మనిషి బాగు కోసం సమాజంలో మంచి కోసం చేసే ప్రయత్నాలు అన్నీ నా దృష్టిలో పైపై తుడుపులు. అవి చేయడం తప్పు అని నేను అనడం లేదు. వాటి అవసరం వున్నది అనడంలో ఏ సందేహమూ లేదు. ఎందుకంటే ఇప్పడు సమాజం వున్న స్థితిలో సామాజిక మార్పులను తీసుకొని వచ్చి, సామాజిక పరిస్థితులను బాగుపరచడానికై పని చేసేవారు తప్పకుండా కావాలి అయితే, మరొక రకమైన కృషి చేసేవారు కూడా అవసరం. నవ్య సమాజ నిర్మాణంలో తప్పడు భావాలకు ఆస్కారం లేకుండా చేయడానికి శ్రమించే వారు కూడా కావాలి.**

*(ది కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ జె. కృష్ణమూర్తి వాల్యూమ్ 1, పుట. 132)*

సెకనులో మెదడులోని జీవకణాలు తమంతట తామే ఉత్పరివర్తనం చెందుతాయి.

ఈ విషయాలను ఈ వక్త కొందరు న్యూరాలజిస్టులతో చర్చించాడు. వాళ్ళు పూర్తిగా ఒప్పుకోలేదను కోండి. అయితే కొంతవరకు మెదడు, నరాల సంబంధిత వైద్యులు ఒప్పుకున్నారు. ఎప్పుడూ ఇదొక ఆట, మీకర్థమయ్యిందా. మనం జీవితాన్ని ఒక ఆటగా పరిగణిస్తాం: ఇది కొంతవరకు నిజం, కొంతవరకు అబద్ధం; మీరు ఒప్పుకావొచ్చు, మీరు తప్పుకావచ్చు. అయితే, జీవనకళ అంటే ఏమిటి? అని మనల్ని మనం ఎప్పుడూ ప్రశ్నించుకోము-ఇది ప్రపంచంలోని అన్ని కళల కంటే గొప్పది. మీరు ఇంకాసేపు ఓపిక పట్టగలరా? మనం ఈ సమస్యను పూర్తి చేద్దాం. తర్వాత మీకు ఇష్టమైతే రేపు మళ్ళీ మనం కలుసుకుందాం. నేను మిమ్మల్ని ఆహ్వానించడం లేదు, అది మీ యిష్టం.

మనం కాలంతో జీవిస్తున్నాం కాబట్టి, కాలం చాలా ముఖ్యమైనదని చెప్పుకున్నాం. అయితే మనం వర్తమానమైన మొత్తం కాలంలో జీవించడం లేదు. భవిష్యతూ, గతమూ, కాలమంతా వర్తమానంలో ఇమిడి ఉన్నది. నేను ఈ రోజు హింసాత్మకంగా ఉంటే, రేపూ హింసాత్మకంగానే ఉంటాను. నేను ఆ హింసను ఈ రోజే సాక్షికంగా కాకుండా, పూర్తిగా పరిసమాప్తి చేయగలనా? చేయగలను. ఇంకా, భయమనేది ఆలోచనతో తేబడిందా? అవుననుకోండి. ఈ వక్త చెబుతున్నాడని, మీరు ఒప్పుకోకండి. మీ అంతట మీరు దీన్ని చూడండి. నేను ఈ రోజు క్షేమంగా ఉన్నాను. అయితే రేపేంజరుగుతుందో నని భయపడుతున్నాను; యుద్ధం రావొచ్చు, ఇంకేదైనా విపత్తురావొచ్చు. కాబట్టి కాలమూ, ఆలోచనలూ భయానికి మూలం.

ఆలోచించడమంటే ఏమిటి? ఆ ప్రశ్న అర్థమయ్యిందా? కాలమూ, ఆలోచనలూ భయానికి మూలమైతే – నిజంగా జరుగుతున్నది అదే. ఆలోచించడమంటే ఏమిటి? ఎందుకు మనం ఆలోచన ఆధారంగా జీవిస్తూ వ్యవహరిస్తూ ప్రతిదీ చేస్తుంటాము. యూరప్‌లోని అద్భుతమైన చర్చి భవనాలు, ఆ అందం, ఆ నిర్మాణం, ఆ వాస్తుశిల్పమూ ఆలోచనచే నిర్మితమయ్యాయి. అన్ని మతాలూ, వాటి సరంజామా, వాటి దుస్తులూ, ఆ మధ్యయుగాల అంగీలూ ఆలోచనచే రూపొందినవే. మీరు కారునడపడం ఆలోచన మీద ఆధారపడిందే. గుర్తు పట్టడం ఆలోచనే. కాబట్టి, మీరు గనక ,చాలా అలసిపోకుంటే– ఆలోచించడమంటే ఏమిటి? అని మనం విచారణ చేసి తర్వాత ఈ సంభాషణను ఆపేద్దాం. బహుశా కొద్ది మందే ఈ ప్రశ్నను అడిగి ఉంటారు. ఈ వక్త ఈ ప్రశ్నను అరవయ్యేళ్ళుగా అడుగుతూ ఉన్నాడు. ఆలోచనంటే ఏమిటి? ఆలోచనకు మూలమేమిటి; ఆలోచనకు మొదలేమిటి, ఎందుకు ఆలోచన మన జీవితంలో అంత విశేష ప్రాముఖ్యాన్ని పొందిందో మీరు తెలుసుకుంటే, అప్పుడు ఆ విచారణలోనే మార్పు చోటు చేసుకోవచ్చు. కాబట్టి ఆలోచనంటే ఏమిటి? ఆలోచించడమంటే ఏమిటి? అని మనం అడుగుతున్నాం. నేను బదులు చెబుతానని ఎదురుచూడకండి. దాన్ని చూడండి, దాన్ని పరిశీలించండి.

ఆలోచించడం అనేది ఒక పదం. ఆ పదం యొక్క ధ్వనీ ఆ పదం యొక్క గుణమూ, ఆ పదం యొక్క అందమూ, లోతూ. ఆ పదమూ, ప్రత్యేకించి ఆ శబ్దమూ చాలా ముఖ్యం. శబ్దమూ, నిశ్శబ్దమూ అనే ప్రశ్న జోలికి నేను వెళ్ళను. ఆలోచించడమనేది జ్ఞాపకంలోని భాగం, కాదా? దయచేసి సౌకర్యంగానో లేక ఇబ్బంది పడుతూనో ఊరికే కూర్చోకండి, ఈ వక్తతో కలసి పరిశోధించండి. ఆలోచించడం జ్ఞాపకంలో భాగం, కాదా? మనకు జ్ఞాపక మనేదే లేకుంటే

మనం ఆలోచించగలిగే వాళ్ళమా? ఆలోచించలేము. మనమెదడు జ్ఞాపకాలను కలిగించే పరికరం. జరిగిన సంగతులు గురించీ, అనుభవాలు గురించీ ఇంకా ఇలాంటి వాటి జ్ఞాపకాలను కలిగించే పరికరం – జరిగిన సంగతులు గురించీ, అనుభవాలు గురించీ ఇంకా ఇలాంటి వాటి జ్ఞాపకం. ఇదే జ్ఞాపకం యొక్క పూర్తి నేపథ్యం. జ్ఞానం నుండీ, అనుభవంనుండీ జ్ఞాపకం ఉదయిస్తుంది– అవునా? కాబట్టి అనుభవమూ, జ్ఞానమూ, జ్ఞాపకమూ, జ్ఞాపకం యొక్క స్పందనా ఆలోచనే. అనుభవించడమూ, జ్ఞప్తికి తెచ్చుకోవడమూ, పట్టి వుంచుకోవడమూ అనే మొత్తం ప్రక్రియ మన జ్ఞానం అవుతుంది. అనుభవమెప్పుడూ పరిమితమైనదే.

అనుభవం, అనుభవించేవాడికన్నా భిన్నమైనదా? మీ మెదళ్ళను ఉపయోగించండి, కనుగొనండి. అనుభవించేవాడు గనక లేకపోతే, అనుభవం ఉంటుందా? ఉండదనేది తెలిసిందే. కాబట్టి చూచేవాడు చూడబడేది మాదిరి అనుభవమూ, అనుభవించేవాడూ ఒక్కటే. ఆలోచించేవాడికి వాడి ఆలోచనలకూ మధ్య భేదం లేదు. ఆలోచించేవాడే ఆలోచన.

కాబట్టి అనుభవం పరిమితమైనది. ఈ సంగతి విజ్ఞాన శాస్త్ర ప్రపంచంలోనూ, ఇతర రంగాల్లోనూ మీరు గమనించవచ్చు. వాళ్ళు తమ అనుభవాలద్వారా, జంతువులపై ప్రయోగాల ద్వారా మరింత, మరింత, మరింత తమ జ్ఞానానికి కలుపుతూ పోతున్నారు, ఆ భయానకమైనదంతా కొనసాగుతూ ఉంది. ఆ 'జ్ఞానం' పరిమితమైనది, ఎందుకంటే దానికి మరింత కలుపుతున్నందున. కాబట్టి జ్ఞాపకం పరిమితమైంది. ఆ జ్ఞాపకంలోని ఆలోచన పరిమితమైంది. కాబట్టి, ఆలోచన పరిమితమైనదైనందున తప్పని సరిగా సంఘర్షణను తీసుకొస్తుంది. ఈ విధానక్రమమంతా గమనించండి. ఈ వక్త చెపుతున్నదాన్ని ఒప్పుకోకండి, ఒప్పుకోవడమనేది అర్థం లేనిది. అతనొక ప్రమాణం కాదు, దేవుడి దయవల్ల గురువుకూడా కాదు. అయితే ఆలోచనా, కాలమూ భయానికి మూలమనే వాస్తవాన్ని మనం కలసి గమనించవచ్చు.

కాలమూ, ఆలోచనా ఒకటే. అవి రెండూ వేర్వేరు చలనాలు కాదు. కాలమూ, ఆలోచనా, కాలపు ఆలోచన, భయానికి మూలమనే నిజాన్నీ వాస్తవాన్నీ చూడండి–మీలో ఇది మీరే పరిశీలించుకోండి. కాలమూ, ఆలోచనా భయాన్ని కలుగచేస్తాయనే నిజాన్నుండీ, సత్యంనుండీ దూరంగా పోకండి. ఆ సత్యాన్నుండి దూరంగా పారిపోకుండా దాన్నే పట్టుకుని దాంతోనే ఉండిపోండి. అది అట్లా ఉన్నది. అప్పుడు మీరొక విలువైన ఆభరణాన్ని మీ చేతిలో పెట్టుకున్నారన్నమాట. ఆ ఆభరణం యొక్క అందాన్ని పరికించండి. అప్పుడు, మానసికంగా భయం పూర్తిగా సమసిపోవడాన్ని మీ అంతట మీరు గమనించవచ్చు. ఎప్పుడైతే భయంలేదో, అప్పుడక్కడ మీరు స్వేచ్ఛగా ఉంటారు. ఎప్పుడైతే పూర్తి స్వేచ్ఛ ఉంటుందో అక్కడ మీకు దేవుళ్ళూ, ఆచారాలూ ఉండవు. మీరొక స్వేచ్ఛా జీవి.

మీరెందుకు చప్పట్లు కొడుతున్నారో నాకు తెలియదు. బహుశా మీకోసం మీరు చప్పట్లు కొట్టుకొంటున్నారేమో. మీరు ఈ వక్తను ప్రోత్సహించడమూ లేదు; అతన్ని నిరుత్సాహ పరచడమూలేదు. అతను మీ నుండి ఏమీ ఆశించడంలేదు. జ్ఞానాన్ని కూడబెట్టుకోకుండా, నేర్చుకోవడం మాత్రమే చేసే మనిషే విద్యార్థి కాబట్టి – మీ అంతట మీరు బోధకుడూ, విద్యార్థీ రెండూ కాగలిగినపుడు – మీరొక అసాధారణమైన మనిషి అవుతారు.

*(వాషింగ్టన్‌లో 1985 ఏప్రిల్ 20న జె. కృష్ణమూర్తి చేసిన ప్రసంగం నుండి)*

# తెలుగు ప్రచురణలు

**జె. కృష్ణమూర్తి** ప్రసంగాలు, రచనలలో కొన్నింటిని తెలుగులోకి అనువదించడం జరిగింది. ఈ పుస్తకాలను కెఎఫ్ఐ చెన్నయి నుండి కాని, విశాలాంధ్రవారి పుస్తక విక్రయశాలల నుండి కాని పొందవచ్చును.

- ❖ గతంనుండి విముక్తి (Freedom from the Known)
- ❖ స్వేచ్ఛ - ఆదిలోనూ, అంతంలోనూ (The First and Last Freedom)
- ❖ శ్రీలంక సంభాషణలు (Sri Lanka Talks)
- ❖ గరుడ యానం (The Flight of the Eagle)
- ❖ కృష్ణమూర్తి తత్త్వం - పరిచయ సంపుటం (Krishnamurti for Beginners)
- ❖ ఈ విషయమై ఆలోచించండి (This Matter of Culture)
- ❖ విద్య - జీవిత ప్రాధాన్యము (Education and the Significance of Life)
- ❖ ముందున్న జీవితం (Life Ahead)
- ❖ నీవే ప్రపంచం (You are the World)
- ❖ మన జీవితాలు-జిడ్డుకృష్ణమూర్తి వ్యాఖ్యానాలు (Commentaries on Living-1)
- ❖ స్వీయ జ్ఞానం (On Self-knowledge)
- ❖ ఈ విప్లవం అంతరంగంలో (The Revolution from Within)
- ❖ ఏకైక విప్లవం (The Only Revolution)
- ❖ ధ్యానం (Meditations)

*Published in August, December & April* Periodical

*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation Inda, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*